# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 80 గురువారం 18-12-2025 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
రిపోర్టర్లు కావలెను
- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు
Contact No: 98497 07349





కెనడా పౌరసత్వం కోసం ఎదురు చూస్తున్న ప్రవాసులకు జస్టన్ ట్రూడో ప్రభుత్వం తీపి కబురు అందించింది. దశాబ్దాలుగా అడ్డంకిగా మారిన 'మొదటి తరం పరిమితి' నిబంధనను సవరిస్తూ.. కెనడా బయట జన్మించిన కెనడియన్ల పిల్లలకు కూడా పౌరసత్వం కల్పించే చారిత్రక సంస్కరణను సోమవారం నుంచి అమలులోకి తెచ్చింది. బిల్ సీ-71 ద్వారా చేపట్టిన ఈ మార్పుల ప్రకారం.. తల్లిదండ్రులు కెనడాలో కనీసం మూడేళ్ల పాటు నివసించినట్లు నిరూపిస్తే, వారి పిల్లలు ప్రపంచంలో ఎక్కడ జన్మించినా కెనడా పౌరసత్వానికి అర్హులవుతారు. 2009 నాటి పాత నిబంధనల వల్ల పౌరసత్వం కోల్పోయిన వేలాది మంది భారతీయ సంతతి కుటుంబాలకు ఈ నిర్ణయం ప్రాణవాయువులా మారింది. కెనడాలో స్థిరపడిన ప్రవాసులకు, ముఖ్యంగా భారతీయ సంతతికి కెనడా ప్రభుత్వం తీపి కబురు అందించింది. పౌరసత్వానికి సంబంధించి దశాబ్దాలుగా ఉన్న కఠిన నిబంధనలను సవరిస్తూ.. జస్టన్ ట్రూడో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కెనడా వెలుపల జన్మించిన కెనడియన్ల పిల్లలకు కూడా పౌరసత్వం కల్పించేలా చట్టంలో మార్పులు చేసింది. ఈ మేరకు బిల్ సీ-71 ద్వారా తీసుకొచ్చిన కొత్త నిబంధనలు సోమవారం నుంచి అధికారికంగా అమలులోకి వచ్చాయి. గతంలో ఉన్న 'మొదటి తరం పరిమితి' నిబంధన ప్రకారం.. కెనడా బయట పుట్టిన కెనడియన్ల పిల్లలకు ఆటోమేటిక్‌గా పౌరసత్వం లభించేది కాదు. తల్లిదండ్రుల్లో కనీసం ఒకరైనా కెనడా గడ్డపై పుట్టి ఉంటేనే వారి పిల్లలకు పౌరసత్వం ఇచ్చేవారు. దీనివల్ల విదేశాల్లో ఉద్యోగాలు లేదా వ్యాపారాల రీత్యా నివసిస్తున్న వేలాది మంది కెనడియన్ల పిల్లలు పౌరసత్వం కోల్పోయి 'స్టేట్‌లెస్'గా మిగిలిపోయారు. కానీ తాజా సవరణలతో ఆ అడ్డంకులు తొలగిపోయాయి. దీని ప్రకారం.. డిసెంబర్ 15వ తేదీ కంటే ముందు విదేశాల్లో జన్మించిన వారు లేదా పాత నిబంధనల వల్ల పౌరసత్వం పొందలేకపోయిన వారు ఇప్పుడు నేరుగా పౌరసత్వ రుజువు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.అలాగే డిసెంబర్ 15వ తేదీ తర్వాత జన్మించే పిల్లల విషయానికొస్తే.. వారి తల్లిదండ్రులు ఆ శిశువు జననానికి ముందు కనీసం మూడేళ్ల పాటు (1,095 రోజులు) కెనడాలో నివసించి ఉండాలి. ఈ 'ఫిజికల్ ప్రెజెన్స్' నిరూపించుకుంటేనే వారి పిల్లలకు కెనడా పౌరసత్వం లభిస్తుంది. నిజానికి ఈ మార్పు వెనుక ఆంటారియో సుపీరియర్ కోర్టు ఇచ్చిన కీలక తీర్పు ఉంది. 2009 నాటి పాత నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని.. ఇవి కెనడియన్ల మధ్య వివక్ష చూపుతున్నాయని 2023లో కోర్టు స్పష్టం చేసింది. దీనిపై అప్పీలుకు వెళ్లకుండా, చట్టాన్ని సవరించడమే సరైన మార్గమని భావించిన ప్రభుత్వం ఈ కొత్త సంస్కరణలను అమలులోకి తెచ్చింది. కెనడాలో భారతీయ సంతతి జనాభా గణనీయంగా ఉంది. వృత్తిరీత్యా అనేక మంది భారతీయులు కెనడా పౌరసత్వం పొందిన తర్వాత కూడా స్వదేశంతో లేదా ఇతర దేశాలతో సంబంధాలు కలిగి ఉంటారు. అలాంటి వారి పిల్లలు విదేశాల్లో జన్మిస్తే ఎదురయ్యే పౌరసత్వ సమస్యలకు ఈ కొత్త చట్టం శాశ్వత పరిష్కారం చూపనుంది. "కెనడా పౌరసత్వాన్ని మరింత సమ్మిళితంగా, న్యాయబద్ధంగా మార్చడమే మా లక్ష్యం" అని ఇమిగ్రేషన్ రిఫ్యూజీ సిటిజెన్‌షిప్ కెనడా పేర్కొంది. తాజా మార్పులతో తమ కుటుంబ భవిష్యత్తుపై నెలకొన్న నీలినీడలు తొలగిపోయాయని ప్రవాస కెనడియన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఇకపై కెనడా బయట జన్మించినా



సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. సికింద్రాబాద్, వికారాబాద్‌ల నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు జనవరి 9 నుంచి 19 వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పెద్ద పండగ. ముఖ్యంగా ఏపీలో సంక్రాంతి పండకు ఉండే హడావుడే వేరు. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు సంక్రాంతి పండక్కి స్వగ్రామాలకు చేరుకుంటారు. చాలా మంది బస్సులు, ప్రవేటు వాహనాలతో పాటు ట్రైన్లలో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇప్పటికే ట్రైన్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే తెలంగాణ నుంచి ఏపీకి పండక్కి ఊరెళ్లేవారికి తీపి కబురు చెప్పింది. సంక్రాంతి సందర్భంగా 16 ప్రత్యేక ట్రైన్లను నడుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్, వికారాబాద్ రైల్వే స్టేషన్ల నుంచి శ్రీకాకుళం రోడ్‌క ఈ ట్రైన్ల రాకపోకలు సాగిస్తాయి. జనవరి 9 నుంచి 19 వరకు ఈ ట్రైన్లు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు సీపీఆర్వో ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్-శ్రీకాకుళం రోడ్డు (ట్రైన్ నెంబర్ 07288) జనవరి 9 నుంచి 11 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ట్రైన్ సికింద్రాబాద్ నుంచి రాత్రి 7 గంటలకు బయల్దేరి.. మరుసటి రోజు 12.30 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది.శ్రీకాకుళం రోడ్డు- సికింద్రాబాద్ ట్రైన్ నెంబర్ 07289 తిరుగు ప్రయాణంలో 3.30 గంటలకు శ్రీకాకుళం నుంచి బయల్దేరి మరుసటి రోజు 8.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ జనవరి 10-12 మధ్య అందుబాటులో ఉంటుంది.సికింద్రాబాద్-శ్రీకాకుళం రోడ్డు ట్రైన్ నెంబర్ 07290 ట్రైన్ రాత్రి 7 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయల్దేరి మరుసటి రోజు 12.30 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది. ఈ ట్రైన్ జనవరి 10-12, 16-18 తేదీల మధ్య అందుబాటులో ఉంటుంది.శ్రీకాకుళం రోడ్డు- సికింద్రాబాద్ ట్రైన్ తిరుగు ప్రయాణంలో 3.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 8.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ జనవరి 11-13, 17-19 తేదీల మధ్య అందాబులో ఉంటుంది.వికారాబాద్-శ్రీకాకుళం రోడ్డు ట్రైన్ జనవరి 13న 5.15 నిమిషాలకు వికారాబాద్ స్టేషన్ నుంచి బయల్దేరి మరుసటి రోజు 12.30 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది.తిరుగు ప్రయాణంలో 07295 నెంబర్ గల ట్రైన్ 3.30 గంటలకు శ్రీకాకుళంలో బయల్దేరి మరుసటి రోజు అంటే 14వ తేదీన సికింద్రాబాద్ స్టేషన్ చేరుకుంటుంది.సికింద్రాబాద్- శ్రీకాకుళం రోడ్డు ట్రైన్ జనవరి 17న రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 12.30 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07293 నెంబర్ గల ట్రైన్ జనవరి 18న 8.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

## ఖాకీ చొక్కాలో 'పచ్చని' స్ఫూర్తి..




కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వాయు కాలుష్యం, భూసారం తగ్గిపోవడం వంటి అనర్థాలను వివరించి, మంటలను స్వయంగా ఆర్పారు. పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను ఆయన రైతులకు వివరించి నెటిజన్లచే ప్రశంసలు అందుకుంటున్నారు. సాధారణంగా పోలీస్ అంటే శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపు వంటి విధుల్లోనే నిమగ్నమై ఉంటారని మనందరం అనుకుంటాం. కానీ.. తన విధి నిర్వహణకు అతీతంగా, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా వ్యవహరిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి. పొలాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల కలిగే అనర్థాలపై ఆయన రైతులకు స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా.. పోలీసు వాహనంలో వెళ్తున్న ఏసీపీకి ఓ రైతు పంట కోతల తర్వాత మిగిలిన వ్యర్థాలను తగులబెట్టడం కనిపించింది. దీంతో వెంటనే వాహనం ఆపిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి రైతు వద్దకు చేరుకున్నారు. ఇలా తగులబెట్టటం వల్ల వాయు కాలుష్యం పెరగడమే కాకుండా, భూమిలోని సహజ సిద్ధమైన సారవంతమైన గుణాలు నశిస్తాయని ఆయన రైతుకు వివరించారు. రైతుతో కలిసి స్వయంగా మంటల్ని ఆర్పివేశారు. పొలాల్లో మంటలు పెట్టడం వల్ల భూమికి మేలు చేసే పురుగులు చనిపోతాయని దీనివల్ల భవిష్యత్తులో దిగుబడి తగ్గడమే కాకుండా నేల నిస్సారంగా మారుతుందని ఆయన అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను రైతులకు అర్థమయ్యే రీతిలో

2


## హైదరాబాద్‌లో బీచ్..



హైదరాబాద్‌లో సముద్ర తీరం లేకపోయినా.. 'ఆపరేషన్ దుర్యోధన' సినిమా డైలాగ్‌ను నిజం చేస్తూ కోత్వాల్‌గూడలో భారీ ఆర్టిఫిషియల్ బీచ్ రానుంది. 35 ఎకరాల్లో రూ. 350 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో వినోదం, అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ రిసార్ట్స్ ఉంటాయి. 2025 డిసెంబర్‌లో పనులు ప్రారంభించి, హైదరాబాద్‌ను గ్లోబల్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా మార్చడమే లక్ష్యంగా పనులు ప్రారంభించేందుకు సర్కార్ సిద్ధమైంది. 'హైదరాబాద్‌కు బీచ్ తీసుకొస్తా...' అనే సినిమా డైలాగ్ గుర్తుందా..? ఆపరేషన్ దుర్యోధన మూవీలో హీరో శ్రీకాంత్ చెప్పిన ఈ డైలాగ్ విని అప్పట్లో అందరూ తెగ నవ్వుకున్నారు. సముద్రంలేని హైదరాబాద్‌కు బీచ్ ఎలా తీసుకొస్తావురా పిచ్చోడా అని మూవీలో తోటి నటీ నటులతో పాటు సినిమా చూసిన ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇప్పుడా డైలాగ్ నిజం నిజం కాబోతోంది. సముద్ర తీరం లేని భాగ్యనగరంలో పర్యాటక రంగాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తూ ఒక భారీ ఆర్టిఫిషియల్ బీచ్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. కేవలం వినోదమే కాకుండా అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ రిసార్ట్స్ కలయికతో ఒక మెగా పర్యాటక హబ్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నారు. హైదరాబాద్ శివార్లలోని ఔటర్ రింగ్ రోడ్‌కు అతి సమీపంలో ఉన్న కోత్వాల్‌గూడ వద్ద సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో ఈ భారీ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. తెలంగాణ ప్రభుత్వ టూరిజం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పబ్లిక్‌ఉ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (ఙ్ఞా) మోడల్‌లో దీనిని నిర్మిస్తున్నారు. దీని కోసం స్పెయిన్‌కు చెందిన ప్రముఖ 'ఫ్లాయ డ్రా' కంపెనీ, ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ, తెలంగాణ ప్రభుత్వం మధ్య కీలక ఒప్పందం కుదిరింది. దాదాపు రూ. 350 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇప్పటికే సిద్ధమైంది. 2025 డిసెంబర్‌లో పనులు ప్రారంభించి హైదరాబాద్‌ను గ్లోబల్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా

2

## సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలి వార్డు మెంబర్‌గా పోటీ..




తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో విద్యావంతుల అరంగేట్రం ఆసక్తికరంగా మారింది. సంగారెడ్డి జిల్లాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, తన హైఫై ఉద్యోగాన్ని వదిలి కుటుంబ ప్రజాసేవ వారసత్వాన్ని కొనసాగిస్తూ గ్రామాభివృద్ధికి నడుం బిగించారు. రిజర్వేషన్లు అనుకూలించకపోయినా.. రాజకీయ చతురతతో తన అనుచరుడిని సర్పంచ్‌గా గెలిపించి, తాను ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో చిత్రవిచిత్ర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చాలా మంది యువత ఈసారి సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా పోటీలో నిలిచారు. అయితే కొందరు ఐదెంకల జీతం, హైఫై లైఫ్, ఉన్నత ఉద్యోగాలు వదిలి పల్లె రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. తాజాగా.. సంగారెడ్డి జిల్లాలోనూ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన విలాసవంతమైన ఉద్యోగాన్ని వదిలి గ్రామాభివృద్ధి కోసం రాజకీయ బాట పట్టడం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది.సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేసేవారు. అయితే.. ఆయన కుటుంబానికి ప్రజాసేవలో సుదీర్ఘ చరిత్ర ఉంది. ప్రవీణ్

2

# ఖాకీ చొక్కాలో 'పచ్చని' స్ఫూర్తి..




ఇంకెప్పుడూ పంటను తగలబెట్టబోనని రైతు నుంచి ఒట్టు వేయించుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వ్యవసాయ పద్ధతులపై రైతులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ఒక పోలీస్ అధికారి ప్రాథమిక విధి కాకపోవచ్చు. కానీ, సమాజం పట్ల ఉన్న నిబద్ధతతో ఆయన ఈ బాధ్యతను భుజానికెత్తుకున్నారు. రైతు దేశానికి వెన్నెముక.. వారు పండించే పంట ఈ దేశానికి ఆహారం, రాబోయే తరాల ఆరోగ్యం అనే విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు. ఒక అధికారిగా కాకుండా, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఆయన రైతులతో మమేకమవుతున్న తీరు రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. తరతరాలుగా సాగు చేస్తున్న రైతులు కొన్నిసార్లు ఆధునిక పద్ధతులు, పర్యావరణ పరిరక్షణ విషయాలను విస్మరిస్తుంటారు. అలాంటి వారికి ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అందిస్తున్న ఈ సూచనలు రేపటి తరానికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడంలో ఎంతగానో తోడ్పడతాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కేవలం నేరాలను అదుపు చేయడమే కాదు, సమాజానికి మేలు చేసే ఏ పనినైనా చేయవచ్చని ఆయన నిరూపిస్తున్నారని అంటున్నారు. నిజంగా ఇలాంటి అధికారులు సమాజానికి దిక్సూచిగా ఉంటారని.. ఆయన చేస్తున్న ప్రయత్నం భవిష్యత్తులో ఎందరికో స్ఫూర్తిదాయకమని.. ఏసీపీ ప్రశాంత్ రెడ్డికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందేనని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.

# హైదరాబాద్‌లో బీచ్..




ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ప్రాజెక్టులో అత్యంత ఆకర్షణీయమైన అంశం ఏమిటంటే.. 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే ఆర్టిఫిషియల్ బీచ్. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ప్రత్యేకమైన ఇసుక, వేవ్ పూల్స్, భారీ మాన్-మేడ్ లేక్ ద్వారా సందర్శకులకు అచ్చం సముద్ర తీరంలో ఉన్న అనుభూతిని కలిగిస్తారు. ఈ నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేయడానికి అంతర్జాతీయ స్థాయి ప్యూరిఫికేషన్ టెక్నాలజీని వాడుతున్నారు. మిగిలిన 20 ఎకరాల్లో అత్యంత విలాసవంతమైన ప్రైవేట్ విల్లాలు, ఫ్లోటింగ్ విల్లాలు, ఫైవ్ స్టార్ హోటళ్లను నిర్మించనున్నారు. ప్రకృతి ఒడిలో విదేశీ పర్యాటక అనుభూతిని అందించేలా ఈ జోన్ ఉండబోతోంది. వినోదంతో పాటు సాహస క్రీడల ప్రియుల కోసం బంజీ జంపింగ్, సేలింగ్, స్కేటింగ్, బీచ్ వాలీబాల్ వంటి ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఫ్యామిలీలతో వచ్చే వారి కోసం చిల్డ్రన్ ప్లే ఏరియాలు, సైక్లింగ్ ట్రాక్స్, వాకింగ్ స్పేస్‌లు, ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో 'వెల్నెస్ స్పా రిసార్ట్' ఈ ప్రాజెక్టుకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇక్కడ ఆయుర్వేద థెరపీలు, యోగా, మెడిటేషన్ క్లాసులు నిర్వహిస్తారు. దేశంలోనే ఇలాంటి ఒక ఇంటిగ్రేటెడ్ ఆర్టిఫిషియల్ బీచ్ ం టూరిజం టౌన్‌షిప్ రావడం ఇదే తొలిసారి. రాబోయే రోజుల్లో హైదరాబాద్ వాసులకు సముద్ర తీర అనుభూతి కోసం గోవా వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కోత్వాల్‌గూడలోనే ఆ కిక్కు లభించనుంది.

# ఆరోగ్యానికి మేలు కాదు డ్యామేజ్ చేస్తాయంట!



చలికాలంలో చాలా మంది ఆరోగ్యానికి మంచిదని కొన్ని ఫుడ్స్ తింటుంటారు. అయితే, ఇవి ఆరోగ్యానికి మేలు చేయకపోగా.. డ్యామేజ్ చేస్తాయని న్యూట్రిషనిస్ట్ అమిత గాద్రే చెబుతున్నారు. ఆమె ప్రకారం కొన్ని ఫుడ్స్‌ని చలికాలంలో తినకూడదు. ఇంతకీ ఆ ఫుడ్స్ ఏంటో తెలుసా? శీతాకాలంలో ప్రజల ఆహారపు అలవాట్లు మారతాయి. శరీరాన్ని వెచ్చగా ఉంచడం కోసం చాలా మంది వేడి వేడిగా తింటుంటారు. ఇందులో వేడి వేడి బజ్జీలు, పకోడీలు, సూపులు ఉంటాయి. అంతేకాకుండా అమ్మమ్మల కాలం నుంచి ఫేమస్ అయిన డ్రై ఫ్రూట్ లడ్డూలు, క్యారెట్ హల్వా, ఉసిరి మిఠాయి వంటివి కూడా చలికాలంలో తింటుంటారు. ఇక, వేడి వేడి పరాఠాలు, నెయ్యితో వేయించిన కూరగాయలు వంటివి కూడా తింటుంటారు. ఇక, బంగాళదుంపలు, చిలగడదుంపల్ని ఉడకబెట్టుకుని తింటారు. అయితే, వీటిలో చాలా వరకు మన ఆరోగ్యానికి హాని చేసేవే ఉన్నాయి. అంతేకాకుండా వీటిని తినడం వల్ల బరువు కూడా పెరిగే ప్రమాదం ఉంది. అయితే, కొన్ని ఆహార పదార్థాల్ని ఆరోగ్యకరమైనవి భావించి చలికాలంలో ఎక్కువగా తింటుంటారు. అయితే, ఇవి ఆరోగ్యానికి హాని చేస్తాయంటున్నారు. పుణేకు చెందిన న్యూట్రిషనిస్ట్ అమిత గాద్రే. అలాంటి ఫుడ్స్ లిస్ట్‌ను కూడా తన ఇన్‌స్టా ఖాతాలో అందించారు. చలికాలంలో దూరంగా ఉంచాల్సిన ఆ ఫుడ్స్ ఏంటో ఇప్పుడు చుద్దాం. చలికాలంలో ఉసిరి కాయలు ఎక్కువగా లభిస్తాయి. ఉసిరి కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తి పెంచడంలో సాయపడుతంది. అందుకే ఉసిరి ఆరోగ్యానికి మంచిదని అమిత చెబుతుంది. అయితే, ఉసిరి మిఠాయి ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు అమిత.

# సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలి వార్డు మెంబర్‌గా పోటీ..




అయితే.. ఆయన కుటుంబానికి ప్రజాసేవలో సుదీర్ఘ చరిత్ర ఉంది. ప్రవీణ్ తల్లిదండ్రులు సుమారు 18 ఏళ్ల పాటు గ్రామంలో వివిధ రాజకీయ పదవుల్లో కొనసాగి ప్రజలకు సేవలందించారు. వారి అడుగుజాడల్లోనే నడుస్తూ.. తన సొంత ఊరిని అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో ప్రవీణ్ తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ గ్రామానికి తిరిగి వచ్చారు. ఇటీవల జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో ప్రవీణ్ సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించారు. అయితే, ఆ స్థానం రిజర్వేషన్ తనకు అనుకూలించకపోవడంతో ఆయన వెనక్కి తగ్గలేదు. రాజకీయ చాతుర్యంతో తన అనుచరుడిని సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టి భారీ మెజారిటీతో గెలిపించుకున్నారు. అదే సమయంలో తాను వార్డు మెంబర్‌గా పోటీ చేసి విజయం సాధించి, ఏకగ్రీవంగా ఉపసర్పంచ్ పదవిని దక్కించుకున్నారు. తాను అనుకున్నట్లుగానే గ్రామానికి సేవలందించే అవకాశం లభించడం పట్ల ప్రవీణ్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులు తమకే దక్కడంతో గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, మల్కాపూర్‌ను ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. విద్యావంతులు రాజకీయాల్లోకి వచ్చి గ్రామాల రూపురేఖలు మార్చాలనే సందేశానికి ప్రవీణ్ ఒక ఉదాహరణగా నిలిచారని పలువురు కొనియాడుతున్నారు. కాగా, ఇప్పటికే ఈనెల 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు పూర్తయిన సంగతి తెలిసిందే. ఈరోజు మూడో విడత ఎన్నికలు జరగ్గా.. మధ్యాహ్నం 1 గంటకు పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండగా.. ఫలితాల కోసం అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# ప్రయాణికులకు శుభవార్త..



దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్రం అమృత్ భారత్ స్టేషన్ పథకం చేపట్టింది. తెలంగాణలో 42 స్టేషన్లు ఆధునీకరించనుండగా, కాజీపేటలో ఎస్కలేటర్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటుగా కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం మొదలు పెట్టగా.. దీని పనులు వేగంగా జరుగుతున్నాయి. కొమురవెల్లి మల్లన్న స్టేషన్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణపైనా త్వరలోనే నిర్ణయం తీసుకోబోతున్నారని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం.. రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే అంశంపై దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా ఉన్న పలు స్టేషన్లలో మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించడం కోసం అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని తీసుకువచ్చింది. దీని ద్వారా తెలంగాణలో మొత్తం 42 రైల్వే స్టేషన్ల రూపు రేఖలు మార్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ కింద.. రాష్ట్రంలోని 42 స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, అత్యాధునిక డిజైన్లు, ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పలు స్టేషన్లలో ఈ సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్లు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం.. రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం తీసుకొచ్చింది. దీనిలో భాగంగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఒకటి, రెండో నంబరు ప్లాట్‌ఫాంల మీద ఎస్కలేటర్లు ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌లో ఇప్పటికే ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ) ఏర్పాటు చేశారు. అలానే దీనికి అదనంగా అత్యాధునిక విధానంలో.. మరో కొత్త వంతెన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం దీని పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. దీని వల్ల.. రైలు ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాం మీదకు వెళ్లడానికి సులభంగా ఉంటుంది. ఇక ఈ ఎస్కలేటర్లు ఎక్కలేనివారు.. పెద్ద మొత్తంలో లగేజీ తీసుకెళ్లేవారు.. అనారోగ్యం బారిన పడిన వారు వెళ్లేందుకు గాను ర్యాంప్ నిర్మాణం చేపట్టగా.. అది కూడా పూర్తయ్యింది. దీనికి రెండు వైపులా లిఫ్ట్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఇవన్నీ అతి త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్‌కి అనుబంధంగా నిర్మిస్తోన్న రైల్వే స్టేషన్ పనులు ఇప్పటికే 95 శాతం పూర్తయ్యాయి. ఇంకో 5 శాతం పనులు మిగిలి ఉన్నాయని తెలిపారు. వీటిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి మల్లన్న భక్తులకు అంకితం చేయాలని అధికారులు భావిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని.. వీలైనంత త్వరగా ఈ రైల్వే స్టేషన్‌కు సంబంధించి మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. అలానే హైదరాబాద్ నగర ప్రయాణికులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తోన్న ఎంఎంటీఎస్ రెండో దశ నెట్‌వర్క్ విస్తరణపైన కూడా చర్చ జరుపుతున్నారు.

# మహిళా సంఘాలకు శుభవార్త..



మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో మోసాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ సమస్యను అరికట్టేందుకు 'మన స్త్రీనిధి' అనే కొత్త యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా మహిళలు తమ రుణ వివరాలు, చెల్లింపులు సులభంగా తెలుసుకోవచ్చు. అంతేకాదు, నేరుగా యాప్ నుంచే జువీ×లు చెల్లించే సౌకర్యం కూడా కల్పించారు. దీంతో మోసాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడం కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరీ ముఖ్యంగా మహిళా సంఘాలకు లోన్ల రూపంలో భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందజేస్తూ వారు ఆర్థికంగా ఎదగడానికి మద్దతు అందజేస్తోంది. వారికి సాధారణ రుణాలతో పాటు అత్యవసర సమయంలో ఆదుకోవడానికి, వ్యాపారాలు చేసుకోవడానికి స్త్రీనిధి పేరుతో ప్రత్యేకంగా లోన్ ఇస్తోంది. దీని కింద అర్హులైన మహిళలకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లోన్లు ఇస్తోంది. బ్యాంకులు ఇలా ఇచ్చిన లోన్లను సరిగా చెల్లించడంలో మహిళా సంఘాల సభ్యులు ముందు వరుసలో ఉంటున్నారని ప్రభుత్వ అధికారులే చాలా సందర్భాల్లో తెలిపారు. చాలా తక్కువ శాతం మంది ఈ లోన్లను చెల్లించలేకపోతున్నారు. గ్రూపుల్లో ఉన్న సభ్యుల్లో కొందరు సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడం వల్ల మిగతా వారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అయితే కొందరు బ్యాంకులకు వెళ్లేంత తీరిక లేకనో.. మరే ఇతర కారణాల వల్లనో లోను ఈఎంఐ చెల్లించడానికి గ్రామ స్థాయిలో గ్రామదీపికలను.. పట్టణాల్లో అయితే ఆర్పీలకు ఇస్తున్నారు. అయితే కొంత మంది సిబ్బంది వాటిని తమ సొంతానికి వాడుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా స్త్రీనిధి లోన్ల చెల్లింపు అంశంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. స్త్రీనిధి సిబ్బంది, సీఆర్పీలు మహిళా సంఘాల సభ్యుల ఇళ్లకు వెళ్లి లోన్ల బకాయి విషయం అడిగే వరకు సంఘం సభ్యులకు తెలియడం లేదు. ఈ క్రమంలో ఇలాంటి మోసాలను అరికట్టడం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇలాంటి మోసాలను అరికట్టడం కోసం 'మన స్త్రీనిధి' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో సంఘ సభ్యుల వివరాలతో పాటు వారు స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు, చెల్లింపుల వివరాలు అందుబాటులో ఉంటాయి. దీని ద్వారానే లోన్ చెల్లింపు చేసుకునే అవకాశం ఉంది. దీని కోసం ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌కి వెళ్లి 'మన స్త్రీనిధి' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఆ సంఘం సభ్యుల వివరాలు కనిపిస్తాయి. అలానే వీరు గతంలో ఎంత లోన్ తీసుకున్నారు.. ఇప్పటి వరకు ఎంత చెల్లించారు.. ఇంకా ఎన్ని నెలలు చెల్లించాలి అనే వివరాలు దీనిలో కనిపిస్తాయి. ఫోన్ నంబర్ అప్‌డేట్ చేయకపోతే.. సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి విషయం చెప్పి అప్‌డేట్ చేయించుకోవాలి. ఈఎంఐ కట్టాలనుకునేవారు.. ఎవరికీ డబ్బులు ఇవ్వకుండా ఫోన్ యాప్‌లో మనస్త్రీనిధి తెలంగాణ అని టైప్ చేస్తే .. చెల్లించాల్సిన నెల వాయిదా మొత్తం కనిపిస్తోంది. ఇలా సులభంగా ఇంటి వద్ద నుంచే చెల్లింపులు చేసుకోవచ్చు.

# ఏ వయసు నుంచి తినిపించాలి

పిల్లలు పుట్టగానే వారికి ఫుడ్ పెట్టే విషయంలో ప్రతీ పేరెంట్ జాగ్రత్తగానే ఉంటారు. ఏదైనా కొత్త ఫుడ్ వారికి పెట్టేటప్పుడు ఏది పెట్టాలి, ఏది పెట్టకూడదనే విషయంలో చాలా సందేహాలు ఉంటాయి. అది హెల్దీ ఫుడ్ అయినా సరే ఎప్పుడు పెట్టాలి, ఎంత పరిమాణంలో పెట్టాలి. ఎలా పెట్టాలి ఇలా చాలా డౌట్స్ ఉంటాయి. ఎగ్ విషయంలో కూడా అంతే. ఎగ్ మంచిదే. కానీ, పిల్లలకి ఏ వయసులో ఎలా తినిపించాలో చాలా మందికి తెలియదు. గుడ్డు మంచి పోషకాహారం. ఎన్నో పోషకాలతో నిండి ఉన్న ఈ గుడ్డుని పిల్లలకి పెట్టడం మంచిదే. కానీ, ఎప్పట్నుంచీ ఏ వయసున్న వారి నుంచి పిల్లలకి గుడ్డు పెట్టాలనే సందేహం ప్రతీ ఒక్క తల్లికి వచ్చే ఉంటుంది. ఇంట్లో పెద్దవారు ఉంటే వారికి తోచిన సలహా వారు ఇస్తారు. అయితే, అసలు నిజాలు ఏంటో డాక్టర్‌ని అడిగి తెలుసుకుని ఆ తర్వాత గుడ్డు తినిపిస్తే మంచిది. దీని గురించి డాక్టర్ గౌతమ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేశారు. అందులో పిల్లలకి గుడ్డు తినిపించే విషయంలో పేరెంట్స్ చేసే మిస్టేక్స్ గురించి చెబుతున్నారు. ఆ మిస్టేక్స్ ఏంటో ముందుగా తెలుసుకోండి. చాలా మంది పేరెంట్స్ చేసే తప్పు ఏంటంటే గుడ్డు మంచిదే అయినప్పటికీ పిల్లలకి ఎప్పుడు తినిపించాలో తెలియక పెద్దగా అయ్యాక తినిపిస్తుంటారు. కానీ, ఎదిగే పిల్లలకి ముందునుంచే తినిపించాలి. 6 నెలల తర్వాత నుంచే ఎగ్ ఎల్లో తినిపించాలి. 8 నెలల తర్వాత నుంచి ఎగ్ వైట్ తినిపించొచ్చు అని డాక్టర్ చెబుతున్నారు. కొంతమంది అపోహ ఏంటంటే ఎగ్ ఎల్లో బ్యాడ్ ఫ్యాట్ అని పిల్లలకి తినిపించరు. కానీ, ఎగ్ ఎల్లో బ్రెయిన్ డెవలప్‌మెంట్‌కి చాలా అవసరం. ఇది పిల్లలకి తినిపించడం అతి ముఖ్యం. పిల్లల బ్రెయిన్ డెవలప్‌మెంట్‌లో ఎగ్ చాలా ముఖ్యం. ఎగ్ ఎల్లోలో గుడ్ ఫ్యాట్ ఉంటుంది. కోలీన్ ఉంటుంది. ఇది పిల్లల్లో మెమరీ పవర్ డెవలప్ అవ్వడానికి చాలా అవసరం. కాబట్టి, ఎగ్ ఎల్లో ఇవ్వాల్సిందే.






# దేవుడు రాసిన స్క్రిప్ట్..



ఒకప్పుడు సచిన్, సెహ్వాగ్ అవుతాడని భావించిన యువ క్రికెటర్ పృథ్వీ షా.. ఫామ్ కోల్పోయి 2025 ఐపీఎల్ మెగా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. ఐపీఎల్ 2026 మినీ వేలంలోనూ మొదట పృథ్వీ షాపై ఎవరూ ఆసక్తి చూపించలేదు. చివరికి ఢిల్లీ క్యాపిటల్స్ అతన్ని మళ్లీ కొనుగోలు చేసింది. అయితే ఫస్ట్ అన్‌సోల్డ్‌గా మిగిలిపోవడంతో హార్ట్ బ్రేక్ సింబల్ స్టోరీ పెట్టిన పృథ్వీ.. ఆ తర్వాత కొన్ని నిమిషాలకే ఫుల్ హార్ట్ సింబల్ పెట్టడం గమనార్హం. కాగా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భారత జట్టులోకి తిరిగి రావాలని పృథ్వీ ఆశిస్తున్నాడు. యంగ్ క్రికెటర్ పృథ్వీ షా ఆట, షాట్ సెలెక్షన్‌ను చూసి.. మరో సచిన్ తెందూల్కర్, సెహ్వాగ్ అవుతాడని అందరూ అనేవారు. అనుకున్నట్లే కెరీర్ ఆరంభంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. భారత జట్టులో అడుగుపెట్టి ఆరంభంలో అదరగొట్టినా.. ఆ తర్వాత క్రమంగా ఫామ్ కోల్పోతూ చివరికి ఐపీఎల్‌లో కూడా చోటు సంపాదించలేక పోయాడు. 2025 మెగా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. దాదాపు కెరీర్‌కు ముగిసిపోతుందనే సమయంలో తాను చేసిన తప్పులు తెలుసుకున్న పృథ్వీ షా.. సరిదిద్దుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాడు. అందులో భాగంగా ముంబై టీమ్ నుంచి మహారాష్ట్ర జట్టుకు మారి.. రంజీ ట్రోఫీలో సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టాడు. రంజీలో మంచి ప్రదర్శన చేస్తున్న పృథ్వీ మళ్లీ ఐపీఎల్‌లో ఆడేందుకు.. తాజాగా జరిగిన మినీ వేలంలో రిజిస్టర్ చేసుకున్నాడు. ఐపీఎల్ 2026 మినీ వేలంలోకి మొదట రూ.75 ప్రారంభ ధరతో వచ్చిన పృథ్వీ షాను కొనుగోలు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపించలేదు. అనంతరం యాక్సలరేటెడ్ రౌండ్ 1లోనూ అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. దీంతో బాధతో హార్ట్ బ్రేక్ సింబల్ ఎమోజీతో 'ఇట్స్ ఓకే' అని ఇన్‌స్టాలో స్టోరీ పెట్టాడు. తాను ఒకటి తలిస్తే.. దేవుడు మరొకటి తలుస్తాడంటారు. ఆ తర్వాత సీన్ రివర్స్ అయింది. దేవుడు రాసిన స్క్రిప్ట్ ప్రకారం పృథ్వీ షాకు మూడోసారి ఛాన్స్ వచ్చింది. ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కటే ఆసక్తి చూపించింది. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఢిల్లీ క్యాపిటల్స్ ప్రారంభ ధరకే కొనుగోలు చేసింది. దీంతో ఆరు నిమిషాల తర్వాత యూటర్న్ తీసుకున్న పృథ్వీ షా హార్ట్ బ్రేక్ స్టోరీ డిలీట్ చేసి.. పూర్తి హార్ట్ సింబల్ పెట్టాడు. కాగా, పృథ్వీ షా 2021 జూలైలో చివరిసారిగా టీమ్‌ఇండియా జెర్సీలో కనిపించాడు. ప్రస్తుతం 58 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 46.02 సగటుతో 4556 పరుగులు చేశాడు. అందులో 13 సెంచరీలు, 18 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 379. లిస్ట్-ఏ మ్యాచ్‌లలో 55.72 సగటు, 125.74 స్ట్రైక్ రేట్‌తో 3399 పరుగులు సాధించాడు. ఇక టీ20ల్లో 151.54 స్ట్రైక్ రేట్‌తో 2902 పరుగులు చేశాడు. 2018లో భారత అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా ఉన్నప్పుడు షా టీమ్‌ఇండియాను వరల్డ్‌కప్ విజేతగా నిలిపాడు. 2018లో ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేసిన పృథ్వీ షా.. ఇప్పటివరకు 79 మ్యాచ్‌లు ఆడాడు. 2024 వరకు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2020, 2021, 2022 వేలానికి ముందు డీసీ ఈ ప్లేయర్‌ను రిటైన్ చేసుకుంది. అయితే 2024లో రిలీజ్ చేసింది. ఫామ్ నిలకడగా లేకపోవడం, ఫిట్‌నెస్ సమస్యలు, ఆఫ్ ఫీల్డ్ సమస్యలతో తొలగించింది. ఆ తర్వాత పృథ్వీని ఎవరూ తీసుకోలేదు. డీసీ ఓనర్.. ఇది పృథ్వీకి ఒక 'కనువిప్పు'గా అభివర్ణించారు. రంజీల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్నందున మళ్లీ హోం టీమ్ అవకాశం ఇచ్చింది. ఈ అవకాశాన్ని పృథ్వీ సద్వినియోగం చేసుకుని.. ఐపీఎల్ మంచి ప్రదర్శన చేస్తే బీసీసీఐ సెలక్టర్ల దృష్టిలో పడే అవకాశం ఉంది. అయితే పృథ్వీ షా టీమ్‌ఇండియాలో మళ్లీ ఆడే విషయంపై దేవుడు స్క్రిప్ట్ ఎలా రాశాడో మరి!



# యాక్సలరేటెడ్ రౌండ్‌లో రూ.13 కోట్లు పలికిన లివింగ్‌స్టోన్..



రౌండ్ 1లో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన లియామ్ లివింగ్‌స్టోన్‌కు యాక్సలరేటెడ్ రౌండ్‌లో ఊహించని డిమాండ్ వచ్చింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఆ తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, కావ్య మారన్ మధ్య జరిగిన ఈ బిడ్డింగ్ వార్‌లో చివరికి లివింగ్‌స్టోన్ రూ. 13 కోట్ల భారీ ధరకు సన్‌రైజర్స్‌కే దక్కాడు. విదేశీ ప్లేయర్లలో కామెరూన్ గ్రీన్, పతిరణ తర్వాత లివింగ్‌స్టోన్ అత్యధిక ధర పలకడం విశేషం. రౌండ్ 1లో వేలానికి వచ్చి అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన మాన్‌స్టర్ బ్యాటర్ లియామ్ లివింగ్‌స్టోన్‌కు యాక్సలరేటెడ్ రౌండ్‌లో మంచి డిమాండ్ వచ్చింది. రూ. 2 కోట్ల బేస్ ప్రైజ్‌తో వేలానికి వచ్చిన లివింగ్‌స్టోన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆసక్తి చూపింది. తొలుత గుజరాత్ టైటాన్స్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్‌తో పోటీ పడగా.. ఆ తర్వాత సంజీవ్ గోయెంకా లివింగ్‌స్టోన్ ధరను అమాంతం పెంచేశాడు. దాంతో చిర్రెత్తుకొచ్చిన కావ్య మారన్ భారీ ధరకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో లియామ్ లివింగ్‌స్టోన్ రూ. 13 కోట్ల ధరకు అమ్ముడయ్యాడు. లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంఛైజీ తమ పర్స్‌లో ఉన్న డబ్బులతో చివరి వరకు బిడ్డింగ్ చేసింది. కానీ లివింగ్‌స్టోన్ కోసమే ఎదురుచూస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రూ. 13 కోట్లకు సొంతం చేసుకుంది. దాంతో తొలి రౌండ్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన లియామ్ లివింగ్‌స్టోన్‌కు మంచి ధరే వచ్చింది.కావ్య మారన్ ఆసక్తి చూసిన సంజీవ్ గోయెంకా కావాలనే లివింగ్‌స్టోన్ ధరను పెంచుతూ వెళ్లాడు. ఒకానొక దశలో కావ్య మారన్ తన చేతిలో ఉన్న బిడ్ పోస్టర్‌ను దించకుండా అలానే ఉంచింది. దాంతో గోయెంకా కావాలనే తమ పర్స్‌లో ఉన్నంత వరకు బిడ్ చేస్తూ వెళ్లాడు. మిగతా ఫ్రాంఛైజీలు ఆసక్తి చూపకపోవడం, వాళ్ల పర్స్‌లో అంత మనీ లేకపోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ లివింగ్‌స్టోన్‌ను దక్కించుకుంది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో కామెరూన్ గ్రీన్ అత్యధికంగా రూ. 25.20 కోట్లు పలికాడు. ఓవర్సీస్ ప్లేయర్లలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా గ్రీన్ నిలిచాడు. గ్రీన్ తర్వాత మతీషా పతిరణ రూ. 18 కోట్లు పలకాడు. ఈ ఇద్దర్నీ కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకుంది. కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్ రూ. 14.2 కోట్లు ధర పలికి రికార్డు సృష్టించారు. ఆ తర్వాత లియామ్ లివింగ్‌స్టోన్ రూ.13 కోట్లు పలకడం విశేషం.మినీ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ లియామ్ లివింగ్‌స్టోన్ మినహా మిగతా అందర్నీ అన్‌క్యాప్డ్ ఇండియన్ ప్లేయర్లనే సొంతం చేసుకోవడం విశేషం. సన్‌రైజర్స్ సొంతం చేసుకున్న ఆటగాళ్ల వీళ్లే.. లియామ్ లివింగ్‌స్టోన్, సలీల్ అరోరా, క్రైన్స్ ఫులేత్రా, ప్రఫుల్ హింజే, ఓంకార్ తర్మాలే, అమిత్ కుమార్, షాకిబ్ హుస్సేన్, శివాంగ్ కుమార్.

# స్నేహితుడిని బూట్లు అడుక్కుని ట్రయల్స్..



ఐపీఎల్ 2026 మినీ వేలంలో జమ్మూకాశ్మీర్‌కు చెందిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఆకిబ్ నబీ దార్ సంచలనం సృష్టించాడు. రూ.30 లక్షల బేస్‌ప్రైస్‌తో వేలంలోకి వచ్చిన అతడిని.. ఢిల్లీ క్యాపిటల్స్ ఏకంగా 28 రెట్లు ఎక్కువ ధర రూ.8.4 కోట్లకు కొనుగోలు చేసింది. ఒకప్పుడు స్నేహితుడి బూట్లతో అండర్-19 ట్రయల్స్ ఆడిన ఆకిబ్.. ఇప్పుడు ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన ఆటగాళ్లలో ఒకరిగా నిలిచాడు. భారత జట్టుకు ఆడటమే తన ఏకైక లక్ష్యమని చెబుతున్నాడు. అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో అన్‌క్యాప్డ్ ప్లేయర్లు అదరగొట్టిన సంగతి తెలిసిందే. అందులో జమ్మూకాశ్మీర్‌కు చెందిన ఆకీబ్ నబీ దార్ ఒకడు. ప్రారంభ ధర రూ.30 లక్షలతో వేలంలోకి వచ్చిన ఆకిబ్ కోసం.. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్తాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు పోటీపడ్డాయి. చివరికి ఢిల్లీ అతడి బేస్‌ప్రైస్ కంటే 28 రెట్లు ఎక్కువగా బిడ్డింగ్ వేసి ఆకిబ్‌ను కొనుగోలు చేసింది. ఒకప్పుడు అండర్-19 ట్రయల్స్ కోసం స్నేహితుడి బూట్లు అడిగాడు. కట్‌చేస్తే ఐపీఎల్ 2026 మినీ వేలంలో అత్యధిక ధర పలికిన అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో ఒకడిగా నిలిచాడు. దీంతో ఆకిబ్ గురించి నెట్టింట్లో తెగ వెతికేస్తున్నారు.ఎవరీ ఆకిబ్ నబీ?29 ఏళ్ల ఆకిబ్ నబీ బారముల్లా జిల్లాలోని క్రేరీ గ్రామంలో జన్మించాడు. అతడి తండ్రి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో నబీని డాక్టర్ చేయాలనేది ఆయన కల. కానీ ఆకిబ్‌కు క్రికెట్ అంటే ఇష్టం. తన తండ్రికి ఇష్టం లేకున్నా ఆకిబ్ క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు. అయితే తాను అండర్-19కు సెలెక్ట్ అయ్యాక.. తండ్రి సపోర్ట్ చేశాడని ఆకిబ్ చెబుతున్నాడు. సరైన క్రీడా మైదానాలు, శిక్షణ సౌకర్యాలు లేని ప్రాంతం నుంచి వచ్చినా.. పట్టుదలతో ఎన్నో ప్రయత్నాల తర్వాత ఎట్టకేలకు ఐపీఎల్‌కు ఎంపికయ్యాడు. బారాముల్లాలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయడానికి ఐపీఎల్ సహాయం చేస్తుందని ఆకిబ్ నబీ అంటున్నాడు. స్నేహితుడి బూట్లు అడుక్కుని..ఆకిబ్ నబీ అండర్ 19 ట్రయల్స్ కోసం జమ్మూకు వెళ్లాడు. అయితే బౌలింగ్ వేయడానికి స్పైక్స్ (ఒక రకమైన షూ) అవసరం అవుతాయని అక్కడికి వెళ్లాకే నబీకి తెలిసింది. కానీ అతడు మాత్రం రూ.500 స్పోర్ట్స్ షూ వేసుకుని వచ్చాడు. ఈ క్రమంలో అప్పటికే అండర్-19లో ఆడిన తన స్నేహితుడిని స్పైక్స్ అడిగాడు. అతడి వద్ద ఉన్న మరో జత బూట్లను నబీకి ఇచ్చాడు. తర్వాత ఫస్ట్ మ్యాచ్ ఫీజుతో కొత్త స్పైక్స్ కొనుక్కున్నాడు. ఇలా ఆకిబ్ నబీ ప్రస్థానం ప్రారంభమైంది. ఆకిబ్ నబీ కెరీర్..ఆకిబ్ నబీ 2020-21 రంజీ సీజన్‌లో జమ్మూకాశ్మీర్ తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. మొదట్లో ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉన్నా.. గత రెండేళ్లుగా అద్భుతాలు సృష్టిస్తున్నాడు. ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో ఇప్పటివరకు 34 మ్యాచ్‌లు ఆడి.. 115 వికెట్లతో పాటు 870 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే 2024 రంజీ సీజన్‌లో 13.93 సగటుతో 44 వికెట్లు తీశాడు. 2025-26 రంజీ సీజన్‌లో ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడి 29 వికెట్లు తీశాడు. అంతేకాకుండా డొమెస్టిక్ టీ20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆకిబ్ సత్తా చాటుతున్నాడు. 7 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీశాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో సత్తాచాటేందుకు సిద్ధమయ్యాడు ఆకిబ్ నబీ.ఆకిబ్ నబీ బౌలింగ్ శైలి సౌతాఫ్రికా బౌలర్ డెయిల్ స్టెయిన్‌ను పోలి ఉంటుందని అంటుంటారు. అందుకే 'బారాముల్లా డెయిల్ స్టెయిన్'గా నబీని అని పిలుస్తారు. కాగా, (MI, RR, KKR, GT, SRH )వంటి ఐపీఎల్ జట్లు ఆకిబ్‌ను ట్రయల్స్ కోసం పిలిచినా.. ఆ జట్లలో స్థానం సంపాదించుకోలేకపోయాడు. గతేడాది ఢిల్లీ కూడా పిలిచింది. కానీ దేశవాళీ క్రికెట్ వల్ల ట్రయల్స్‌లో పాల్గొనలేకపోయాడు. కాగా, బాల్‌తో పాటు బ్యాట్‌తో కూడా రాణించే ఆకిబ్.. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు. దానికోసం ఎంత కష్టం అయినా పడతా అని అంటున్నాడు.

# చరిత్ర సృష్టించిన వరుణ్ చక్రవర్తి..

**టీ20ల్లో బుమ్రా రికార్డు బద్దలు..**

టీమ్‌ఇండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి.. ఐసీసీ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ రేటింగ్ సాధించి చరిత్ర సృష్టించాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో 818 పాయింట్లు సాధించాడు. తన సమీప ప్రత్యర్థిపై 119 పాయింట్ల ఆధిక్యం సాధించాడు. టీ20 ప్రపంచ కప్‌కు దాదాపు రెండు నెలల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో.. టీమ్‌ఇండియాలో వరుణ్ చక్రవర్తి కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. మరో బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ కూడా నాలుగు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. టీమ్‌ఇండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అరుదైన ఘనత సాధించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టీ20 ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమ రేటింగ్ సాధించిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇప్పటి వరకు జస్‌ప్రీత్ బూమ్రా పేరిట ఉన్న రికార్డును బద్దలుగొట్టి.. కెరీర్ బెస్ట్ రేటింగ్ సాధించాడు. టీ20 వరల్డ్ నేపథ్యంలో భారత డిఫెన్స్ విభాగంలో వరణ్ చక్రవర్తి ఉండటం టీమ్‌ఇండియాకు మంచి పరిణామంగా కనిపిస్తోంది. కాగా, ఇటీవల ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు కేకేఆర్ వరుణ్ చక్రవర్తిని రిటైన్ చేసుకుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వరుణ్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. సఫారీలతో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఇప్పటి రెండేసి వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా 6.75 ఎకానమీతో వికెట్లు తీసిన వరుణ్ చక్రవర్తి.. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 818 పాయింట్లు సాధించాడు. దీంతో రెండో ర్యాంకర్ జేకబ్ డఫీ (699 పాయింట్లు)కి అందనంత దూరంలో నిలిచాడు. జాకబ్ కంటే 119 పాయింట్లు చక్రవర్తికి ఎక్కువగా ఉన్నాయి. 2017లో బుమ్రా కెరీర్ బెస్ట్ 783 రేటింగ్ పాయింట్లతో ఈ ఘనత సాధించాడు. వరుణ్ చక్రవర్తి ఇప్పుడు దాన్ని అధిగమించాడు.టీ20 వరల్డ్ కప్‌లో కీలక పాత్ర..గతేడాది బార్బడోస్‌లో టీమ్‌ఇండియా ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ టైటిల్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అయితే టీమ్‌ఇండియా ఆ టైటిల్‌ను మరోసారి చేజిక్కించుకోవడానికి.. దాదాపు రెండు నెలల సమయమే ఉంది. ఈ తరుణంలో వరుణ్ చక్రవర్తి టీమ్‌లో ఉండటం భారతదేశానికి మంచి పరిణామమే. రెండోసారి టీమ్‌ఇండియా టీ20 వరల్డ్ కప్ ట్రోఫీని గెలుచుకునే.. ప్రయత్నంలో చక్రవర్తి కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.మరోవైపు, లెఫ్ట్‌హ్యాండ్ సీమర్ అర్ష్‌దీప్ సింగ్.. దక్షిణాఫ్రికాతో జరిగుతున్న టీ20 సిరీస్‌లోని మూడో మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన అర్ష్‌దీప్ సింగ్.. ఐసీసీ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని.. 16వ ప్లేస్‌కు చేరుకున్నాడు. అదే సమయంలో, దక్షిణాఫ్రికాకు చెందిన మార్కో జాన్సెన్ (14 స్థానాలు మెరుగుపడి 25వ స్థానానికి), లుంగీ ఎంగిడి (11 స్థానాలు మెరుగుపడి 44వ స్థానానికి), ఓట్నీల్ బార్ట్‌మాన్ టాప్ 100 కింది నుంచి 68వ స్థానానికి చేరుకున్నారు.



### మెన్స్ టీ20 బెస్ట్ బౌలర్ రేటింగ్స్...

1. ఉమర్ గుల్ (పాకిస్తాన్) - 865.
2. శామ్యూల్ బద్రీ (వెస్టిండీస్) - 864.
3. డేనియల్ వెటోరి (న్యూజిలాండ్) - 858.
4. సునీల్ నరైన్ (వెస్టిండీస్) - 832.
5. రషీద్ ఖాన్ (అఫ్గనిస్తాన్) - 828.
6. తబ్రేజ్ షంసీ (దక్షిణాఫ్రికా) - 827.
7. షాహిద్ అఫ్రిది (పాకిస్తాన్) - 822.
8. వరుణ్ చక్రవర్తి (భారత్) - 818.
9. షాదాబ్ ఖాన్ (పాకిస్తాన్) - 811.
10. వనిందు హసరంగా (శ్రీలంక) - 809.





# అలాంటివి సపోర్ట్ చేయకండి



సినీ నటి శ్రీలీల, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో సృష్టిస్తున్న అభ్యంతరకరమైన కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని ప్రజలను కోరారు. కళను వృత్తిగా ఎంచుకున్నా, ప్రతి అమ్మాయి ఒకరి కూతురో, సోదరో, స్నేహితురాలో అని గుర్తుంచుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ పరిణామాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, తోటి నటీమణుల తరపున మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి సృష్టిస్తున్న నాన్‌సెన్స్ కంటెంట్‌ను ఎంకరేజ్ చేయొద్దంటూ సినీ నటి శ్రీలీల అభ్యర్థించారు. కళను వృత్తిగా ఎంచుకున్నా సరే, ప్రతి అమ్మాయి ఒకరి కూతురో, సోదరో లేదా స్నేహితురాలో అన్న విషయం మర్చిపోవద్దంటూ సోషల్ మీడియాలో ఎమోషన్ పోస్ట్ చేశారు.“ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి క్రియేట్ చేస్తున్న అర్థరహితమైన కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని సోషల్ మీడియా వినియోగదారులందరినీ నేను చేతులు జోడించి వేడుకుంటున్నాను. టెక్నాలజీని వాడుకోవడం వేరు, దానిని వేధించడానికి ఉపయోగించడం వేరు. సాంకేతికత అనేది మన జీవితాలను మెరుగుపరచాలి కానీ, ఇలా ఇబ్బందుల్లోకి నెట్టకూడదు. కళను వృత్తిగా ఎంచుకున్నా సరే, ప్రతి అమ్మాయి ఒకరి కూతురో, సోదరో లేదా స్నేహితురాలో అన్న విషయం మర్చిపోవద్దు“ “మేము ఎంతో ఇష్టపడే ఈ సినీ పరిశ్రమలో మాకు రక్షణ ఉంటుందన్న నమ్మకంతో పని చేయాలనుకుంటున్నాం. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ అసభ్యకరమైన పరిణామాలు నన్ను తీవ్రంగా కలచివేశాయి. ఇవి చాలా బాధాకరమైనవి. నా తోటి నటీమణులు కూడా ఇలాంటి వేధింపులకే గురవుతున్నారు, కాబట్టి వారందరి తరపున నేను ఈ విషయాన్ని మాట్లాడుతున్నాను. నా అభిమానులు, ప్రేక్షకులు మాకు అండగా నిలబడతారని ఆశిస్తున్నాను. దీనిపై ఇప్పటికే అధికారులు చర్యలు చేపడుతున్నారు“ అని శ్రీలీల తన ప్రకటనలో రాసుకొచ్చారు.

**చేతులు జోడించి వేడుకుంటున్నా**

# ఏఎన్నార్ కాలేజీకి రూ.2 కోట్ల విరాళం



గుడివాడ ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవాల్లో అక్కినేని నాగార్జున పాల్గొన్నారు. రూసా భవనాన్ని ప్రారంభించి, విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం అక్కినేని కుటుంబం తరపున రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. తండ్రి నాగేశ్వరరావు స్ఫూర్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మనుషులు శాశ్వతం కాదని, మనం చేసే పనులే శాశ్వతమని ఆయన పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలో ఏఎన్నార్ కాలేజీ 75 ఏళ్ల వజ్రోత్సవ కార్యక్రమంలో ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున పాల్గొన్నారు. కళాశాలలో రూసా భవనాన్ని బుధవారం (డిసెంబర్ 17) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎన్నార్ కాలేజ్ స్టూడెంట్స్ స్కాలర్‌షిప్స్ కోసం రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు చదువుకోకపోయినా, ఎందరికో బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు కృషి చేశారని నాగార్జున అన్నారు. నాగార్జున మాట్లాడుతూ 1959లోనే కాలేజీకి ఏఎన్నార్ రూ.లక్ష విరాళం అందించారన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం అక్కినేని ఫ్యామిలీ తరపున 2 కోట్ల రూపాయల డొనేషన్ అందిస్తున్నట్లు తెలిపారు. మనుషులు శాశ్వతం కాదని, మనం చేసే పనులు శాశ్వతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సోదరుడు వెంకట్, సోదరి నాగ సుశీల, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# ‘జైలర్ 2’లో బాలీవుడ్ బ్యూటీ ఐటెమ్ సాంగ్..



డార్క్ హ్యూమర్, క్యారెక్టర్ బేస్డ్ టేకింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్, ‘జైలర్’ విజయంతో తన డైరెక్షన్ పవర్‌ను మరోసారి నిరూపించాడు. రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా ‘జైలర్’ నిలిచింది. ఈ విజయానికి కొనసాగింపుగా రూపొందుతోన్న ‘జైలర్ 2’పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఫస్ట్ పార్ట్‌లో తమన్నా చేసిన ‘కావాలయ్య’ పాట ఎంతటి సంచలనంగా మారిందో తెలిసిందే. ఇప్పుడు సీక్వెల్‌లో దానికంటే ఎక్కువ ఆకర్షణ ఉండేలా స్పెషల్ ఐటెమ్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ పాటలో నోరా ఫతేహ కనిపించనున్నట్లు కోలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. తమిళ సినిమా రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుల్లో నెల్సన్ దిలీప్ కుమార్ ఒకరు. డార్క్ హ్యూమర్, క్యారెక్టర్ బేస్డ్ సీన్స్ ఇవన్నీ నెల్సన్ సినిమాలకు ప్రత్యేకమైన ట్రేడ్‌మార్క్‌గా మారాయి. దర్శకుడిగా ఆయన ప్రయాణం ‘కోలమావు కోకిల’తో మొదలైంది. తొలి సినిమాతోనే కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకోవడం అరుదైన విషయం. ఆ తర్వాత శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన ‘డాక్టర్’తో నెల్సన్ ఒక్కసారిగా స్టార్ డైరెక్టర్ లీగ్‌లోకి అడుగుపెట్టాడు. ఈ సినిమా సాధించిన విజయం ఆయన కెరీర్ గ్రాఫ్‌ను పూర్తిగా మార్చేసింది. ఈ విజయాల తర్వాత కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ స్వయంగా నెల్సన్‌కు అవకాశం ఇవ్వడం విశేషం. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన ‘బీస్ట్’ భారీ అంచనాల మధ్య విడుదలైంది. అయితే ఆశించిన స్థాయిలో సినిమా వర్కౌట్ కాకపోవడంతో నెల్సన్‌పై విమర్శలు మొదలయ్యాయి. అయితే విమర్శలకు మాటలతో కాదు, సినిమాతోనే సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్న నెల్సన్, వెంటనే సూపర్ స్టార్ రజనీకాంత్‌తో ‘జైలర్’ సినిమాను తెరకెక్కించాడు. అప్పటికే వరుస ఫెయిల్యూర్స్‌తో ఉన్న రజనీ కెరీర్‌కు ‘జైలర్’ ఓ స్ట్రాంగ్ రీబౌండ్‌గా నిలిచింది. ‘జైలర్’ రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలవడం విశేషం. ఈ సినిమాకు కథ కన్నా కూడా రజనీకాంత్‌లోని ప్లస్ పాయింట్స్ అన్నింటినీ పర్ఫెక్ట్‌గా ఉపయోగించుకోవడమే ప్రధాన బలమైంది. స్టైల్, స్వాగ్, మాస్ ఎలివేషన్స్ ఇవన్నీ అభిమానులు కోరుకున్న రేంజ్‌లో ఉండటంతో సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ విజయంతో ‘ జైలర్ 2 ’పై అంచనాలు సహజంగానే భారీగా పెరిగిపోయాయి. ఇప్పటికే సీక్వెల్ పనులు వేగంగా సాగుతున్నాయని కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పుడు ‘జైలర్ 2’కి సంబంధించి మరో ఆసక్తికరమైన న్యూస్ వైరల్ అవుతోంది. ఫస్ట్ పార్ట్‌లో తమన్నా చేసిన ‘కావాలయ్య’ పాట ఎంతటి సెన్సేషన్ సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమా మొత్తానికే ఒక అదనపు ఆకర్షణగా నిలిచిన ఆ ఐటెమ్ సాంగ్ సోషల్ మీడియాలోనూ భారీగా ట్రెండ్ అయింది. ఇప్పుడు సీక్వెల్‌లో కూడా అలాంటి స్పెషల్ సాంగ్‌ను మరింత గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారట. ఈ పాట కోసం బాలీవుడ్ డ్యాన్స్ క్వీన్ నోరా ఫతేహను ఎంపిక చేసినట్లు సమాచారం. ఫస్ట్ పార్ట్‌లో తమన్నా ఎలా ఊపేసిందో, సీక్వెల్‌లో దానికంటే మించిన విజువల్ ట్రీట్ ఇవ్వాలన్నదే నెల్సన్ ప్లాన్ అని వినిపిస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.నోరా ఫతేహ కెరీర్‌ను చూస్తే ఆమెకు డ్యాన్స్ విషయంలో ఉన్న క్రేజ్ స్పష్టంగా కనిపిస్తుంది. కెనడాలో పుట్టిన ఆమె భారతీయ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. 2014లో ‘రోర్: టైగర్స్ ఆఫ్ ది సుందర్బన్స్’తో సినీ రంగంలోకి అడుగుపెట్టిన నోరా, తెలుగులో ‘టెంపర్’, ‘కిక్ 2’, ‘లోఫర్’, ‘ఊపిరి’ చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో మెరిసింది. అంతేకాదు, ‘బాహుబలి’లోని ‘మనోహరి’ పాటతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఇప్పుడు ‘జైలర్ 2’లో నోరా ఫతేహీ స్పెషల్ సాంగ్ నిజమైతే ఈ సీక్వెల్‌పై క్రేజ్ మరింత రెట్టింపు కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ‘మహారాజు’గా బాలయ్య...

నందమూరి బాలకృష్ణ ఇటీవల ‘అఖండ 2’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆశించిన స్థాయిలో ఫలితం రాకపోయినా, బాలయ్య తన తదుపరి ప్రాజెక్ట్‌పై పూర్తిగా దృష్టి సారించారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న ఆయన 111వ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘వీరసింహారెడ్డి’ భారీ విజయం సాధించడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుండగా, బాలకృష్ణ ద్విపాత్రాభినయంలో మహారాజు పాత్రలో కనిపించనున్నారు. నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం వరుస సినిమాలతో యంగ్ హీరోలకు ఏమాత్రం తగ్గకుండా గట్టి పోటీ ఇస్తున్నారు. ఇటీవల బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ‘ అఖండ 2 ’ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాలయ్య, ఆ సినిమాపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో రిజల్ట్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ, బాలకృష్ణ మాత్రం ఆ సినిమా విషయాన్ని పక్కన పెట్టి తన తదుపరి ప్రాజెక్ట్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కెరీర్‌లో వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు దూసుకెళ్లే తత్వం ఉన్న బాలయ్య, ఇప్పటికే తన 111వ చిత్రంపై ఫుల్ కాన్సన్‌ట్రేషన్ పెట్టారు. ఈ సినిమాను దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించబోతున్న సంగతి తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘వీరసింహారెడ్డి’ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ఆ విజయం తర్వాత మరోసారి ఈ కాంబినేషన్ రిపీట్ కావడంతో అభిమానుల్లో అంచనాలు సహజంగానే పెరిగిపోయాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, మొదటి షెడ్యూల్‌లోనే బాలకృష్ణ పాల్గొనబోతున్నారని సమాచారం. ఈ సినిమా పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుందని ఇప్పటికే విడుదలైన పోస్టర్ల ద్వారా స్పష్టమైంది. కథలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేయనున్నారని, అందులో ఒక పాత్ర మహారాజుగా ఉండబోతుందని తెలుస్తోంది. ఇదే నేపథ్యంలో ఈ సినిమాకు ‘మహారాజు’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారన్న టాక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. త్వరలోనే టైటిల్‌పై అధికారిక ప్రకటన రానుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. పీరియాడికల్ నేపథ్యానికి, బాలయ్య మహారాజు పాత్రకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



# వార్ డాగ్‌గా మంచు మనోజ్..

విలన్‌గా ‘మిరాయ్‘తో హిట్ కొట్టిన మంచు మనోజ్, ఇప్పుడు ‘డేవిడ్ రెడ్డి‘గా హీరోగా వస్తున్నారు. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో వస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ మూవీ టీజర్ విడుదలైంది. బ్రిటిష్ వారిని భయపెట్టి, సొంత జనాలచే అపార్థం చేసుకున్న డేవిడ్ రెడ్డి పాత్రలో మనోజ్ వార్ డాగ్‌గా కనిపించనున్నారు. తెలుగుతో పాటు పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ‘మిరాయ్‘ సినిమాతో విలన్ గా బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన మంచు మనోజ్ .. ఇప్పుడు హీరోగా అలరించడానికి రెడీ అయ్యారు. ఆయన కథానాయకుడిగా తెరకెక్కుతున్న లేటెస్ట్ పీరియాడికల్ యాక్షన్ మూవీ ‘డేవిడ్ రెడ్డి’. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. టైటిల్ తోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమా టీజర్ ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు.“డేవిడ్ రెడ్డిని చూసి బ్రిటిష్ వారు భయపడ్డారు, సొంత జనాలు అపార్థం చేసుకున్నారు“ అంటూ వచ్చిన ‘డేవిడ్ రెడ్డి’ టీజర్ ఇంట్రెస్టింగ్ గా ఉంది. హీరో క్యారక్టర్ ఎలా ఉండబోతోంది?, సినిమా కాన్సప్ట్ ఏంటి? అంశాలు తెలియజేసేలా ఈ వీడియో కట్ చేశారు. వార్ డాగ్‌గా మంచు మనోజ్ డిఫరెంట్ లుక్ లో కనిపించారు. “యే బ్రిటీష్ ఇండియా నహీ హై.. యే డేవిడ్ రెడ్డి కా ఇండియా హై“ అని మనోజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంటోంది. కెజిఫ్ సినిమాకి వర్క్ చేసిన మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రురు, ఎడిటర్ ఉజ్వల్ కులకర్ణి ‘డేవిడ్ రెడ్డి’ చిత్రంలో భాగమయ్యారు. తెలుగుతో పాటుగా ఇంగ్లీష్, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.




Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com